


## కెనరా బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, నవంబర్ 9: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ రుణ గ్రహీతలకు షాకిచ్చింది. బెంచ్‌మార్క్ లెండింగ్ రేటును 5 బేసిస్ పాయింట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో అన్ని రకాల రుణాలపై నెలవారి చెల్లింపులు అధికంకానున్నాయి. పెరిగిన వడ్డీరేట్లు ఈ నెల 12 నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.70 శాతం నుంచి 8.75 శాతానికి చేరుకోనున్నది. వీటితోపాటు ఒక్కరోజు, నెల, మూడు, ఆరు నెలల ఎంసీఎల్ఆర్‌లను కూడా 5 బేసిస్ పాయింట్లు వడ్డించింది బ్యాంక్.

## గ్రాన్యూల్ ప్రాఫిట్ డౌన్

హైదరాబాద్, నవంబర్ 9: ప్రముఖ ఫార్మా సంస్థ గ్రాన్యూల్స్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో కంపెనీ పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం రూ.102.10 కోట్లకు తగ్గింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.145 కోట్ల లాభంతో పోలిస్తే 30 శాతం తగ్గింది. కానీ, ఆదాయం మాత్రం ఏడాది ప్రాతిపదికన 3 శాతం ఎగబాకి రూ.1,189.50 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.


## పతంజలి లాభం రెండింతలు

న్యూఢిల్లీ, నవంబర్ 9: పతంజలి ఫుడ్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో సంస్థ రూ.254.53 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.112.28 కోట్ల లాభంతో పోలిస్తే రెండు రెట్లు పెరిగింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.8,524.67 కోట్ల నుంచి రూ.7,845.79 కోట్లకు తగ్గినట్టు పేర్కొంది. మరోవైపు మాజీ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీని ఉత్పత్తులకు ప్రచారకర్తగా నియమించుకున్నది. నిర్వహణ ఖర్చులు రూ. 8,371 కోట్ల నుంచి రూ.7,510 కోట్లకు తగ్గాయి. సంస్థకు వచ్చిన ఆదాయంలో ఫుడ్, ఎఫ్‌ఎంసీజీ నుంచి రూ.2,487.62 కోట్లు సమకూరినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# ఫైడ్ హైదరాబాద్

### గూగుల్ అతిపెద్ద బిల్డింగ్ నిర్మాణం ప్రారంభం

*ఇది కేవలం భవనం కాదు.. దేశ ప్రతిష్ఠ భౌగోళిక, రాజకీయ ప్రాధాన్యతకు నిదర్శనం • ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా*





హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): మార్గాలన్నీ రోమ్‌కే దారితీస్తాయి అనేది యూరప్‌లో మధ్యయుగాల నాటి నానుడి. 'పరిశ్రమలన్నీ హైదరాబాద్‌కే వెళ్తాయి' అనేది నేటి వాస్తవంగా మారింది. ప్రపంచంలోని ఏ దిగ్గజ సంస్థ అయినా సరే భారత్‌లో పెట్టుబడులు పెట్టాలంటే తిరుగులేని ఆప్షన్ హైదరాబాద్. ఈ వాస్తవం ఇప్పటికే నిరూపణ అయ్యింది. నిత్యం అనేకమంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ విజయాల గురించి ప్రస్తావిస్తూనే ఉంటారు. తాజాగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా మరోసారి హైదరాబాద్‌లోని పారిశ్రామిక ప్రభంజనంపై సోషల్‌మీడియాలో ప్రశంసలు కురిపించారు. ప్రపంచ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికా వెలుపల తన అతిపెద్ద క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేస్తున్న విషయం తెలిసిందే. ఈ భవన నిర్మాణం ప్రారంభాన్ని పురస్కరించుకొని ఆయన స్పందించారు. ఇది కేవలం ఒక కొత్త భవన నిర్మాణానికి సంబంధించిన వార్త మాత్రమే కాదని, గూగుల్ వంటి ఒక ప్రపంచ దిగ్గజ సంస్థ తమ అతిపెద్ద కార్యాలయ భవనాన్ని అమెరికా వెలుపల నిర్మించడం, దీనికోసం భారత్‌ను ఎంచుకోవడం గొప్ప విషయంగా అభివర్ణించారు. భవన నిర్మాణం ప్రారంభ వీడియోపై ఎక్స్ (ట్విట్టర్)లో తన అభిప్రాయాలు వెల్లడించారు. ఇది కేవలం వాణిజ్య వార్త కాదని, భౌగోళిక రాజకీయ ప్రకటన అని అన్నారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలు భారత్‌ను ఎంచుకుంటున్నాయని, ఇది మన దేశ ప్రతిష్ఠ, భౌగోళిక, రాజకీయ ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**అతిపెద్ద క్యాంపస్**

గూగుల్ సంస్థ భారతలో తన ప్రధాన కార్యాలయాన్ని ఇప్పటికే హైదరాబాద్‌లో ఏర్పాటుచేసింది. దానికి అదనంగా ఆ సంస్థ ప్రపంచంలోనే తమ ద్వితీయ అతిపెద్ద కార్యాలయ నిర్మాణాన్ని ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభించింది. కాలిఫోర్నియాలోని మౌంటెన్ వ్యూ ప్రధాన కార్యాలయం తరువాత హైదరాబాద్‌లో నిర్మిస్తున్న కార్యాలయం ఆ కంపెనీకి అతిపెద్దది కావడం విశేషం. నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మూడు మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని నిర్మిస్తున్నారు. 2026 నాటికి ఈ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్ బిల్డింగ్ విధానంలో, అత్యాధునిక నిర్మాణ పద్ధతులతో దీన్ని నిర్మిస్తున్నారు.

### యూరప్‌నూ దాటేస్తది

**మైఖేల్ మఖల్**

హైదరాబాద్ నగరం ఐరోపా, ఆగ్నేయా ఆసియా దేశాల్లోని ముఖ్యమైన మెట్రో నగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అభివృద్ధి చెందిందని ప్రముఖ విద్యావేత్త, వ్యాపారవేత్త, మ్యూజిక్ కంపోజర్, ఐఏఎఫ్ బిజినెస్ లీడర్షిప్ అవార్డు గ్రహీత మైఖేల్ మఖల్ ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రశంసించారు. 2002లో వేరే రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడినట్లు, గడిచిన ఎనిమిదేండ్లలో హైదరాబాద్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, ఈ మధ్య కాలంలో ఇక్కడ జరిగిన అభివృద్ధి నిజంగా ఆశ్చర్యం కలిగిస్తున్నదని, ఇక్కడి అభివృద్ధి నమ్మశక్యంగా లేదని ఆయన పేర్కొన్నారు. తాను చాలాసార్లు ఐరోపా, ఆగ్నేయా దేశాలకు వెళ్లినట్లు, హైదరాబాద్ నగరం అక్కడి ప్రధాన మెట్రో నగరాలకు ఏమాత్రం తీసిపోనివిధంగా అభివృద్ధి చెందిందన్నారు. ఇదే అభివృద్ధి కొనసాగితే సమీప భవిష్యత్తులో ఆయా దేశాల మెట్రో నగరాలను వెనక్కు నెట్టి హైదరాబాద్ మరింత ముందుకు పోతుందనే భావన కలుగుతుందన్నారు.



## ధంతేరస్‌కు దిగొచ్చిన పసిడి

### రూ.400కుపైగా తగ్గిన బంగారం ధర



న్యూఢిల్లీ, నవంబర్ 9: ధంతేరస్ (ధనత్రయోదశి) ముందట బంగారం ధరలు దిగొచ్చాయి. గురువారం హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పసిడి ధర రూ.440 తగ్గి రూ.60,760గా ఉన్నది. 22 క్యారెట్ రేటు 10 గ్రాములు రూ.400 పడిపోయి రూ.55,700లుగా నమోదైంది. ఢిల్లీలోనూ రూ.400 కోల్పోయి 24 క్యారెట్ గోల్డ్ రూ.60,950 పలికింది. నిజానికి గత ఆరు రోజుల్లో బంగారం ధరలు సుమారు వెయ్యి రూపాయలదాకా తగ్గుముఖం పట్టాయి. కాగా, ఈ ఏడాది ధంతేరస్ శుక్రవారం వచ్చిన విషయం తెలిసిందే. ఈ రోజున బంగారం, వెండి తదితర విలువైన లోహాలు, వాటితో తయారైన నగలు, వస్తూత్పత్తుల కొనుగోళ్లు శుభప్రదమని భారతీయుల నమ్మకం.

**10 శాతం పెరగొచ్చు**

ఈ ధంతేరస్‌కు బంగారు ఆభరణాలు, బులియన్ అమ్మకాలు నిరుడుతో పోల్చితే 10 శాతం మాత్రమే పెరుగవచ్చని నగల వ్యాపారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ధరలు 20 శాతానికిపైగా పెరిగాయని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే సేల్స్‌పై ఎక్కువగా అంచనాలు పెట్టుకోవడం లేదన్న అభిప్రాయాలు నగల వర్తకుల నుంచి వినిపిస్తున్నాయి. గత ఏడాది ధంతేరస్ రోజున తులం 24 క్యారెట్ బంగారం రేటు రూ.50,139 (పన్నులు అదనం) పలికింది. అంతకుముందు సంవత్సరం 2021లో రూ.47,644గా ఉన్నది.

## మూడేండ్లలో రూ.3,400 కోట్లు

### పెట్టుబడులు పెట్టనున్న అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ, నవంబర్ 9: హెల్త్‌కేర్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. దేశవ్యాప్తంగా నాణ్యమైన హెల్త్‌కేర్ సర్వీసులకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా వచ్చే మూడేండ్లలో రూ.3,435 కోట్ల మూలధన పెట్టుబడులతో ప్రస్తుత సామర్థ్యానికి తోడు మరో 2,300 పడకలు జత చేయనున్నట్టు తెలిపింది. గురువారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ సిఫార్సుల్ని ఆమోదించింది. 325 పడకల సామర్థ్యంతో పాక్షికంగా నిర్మాణమైన ఒక హాస్పిటల్‌ను ఇటీవల అపోలో కొనుగోలు చేసింది. దీంతో దేశంలోని తూర్పు ప్రాంతంలో అపోలో హాస్పిటల్స్ బెడ్స్ సంఖ్య 1,800కు పెరిగింది. రానున్న మూడేండ్లలో ఈ సంఖ్యను 2,500కు పెంచాలన్నది ప్రతిపాదన. అలాగే పుణెలో 250 బెడ్స్ కలిగిన ఒక కొత్త హాస్పిటల్‌ను కొనేందుకు కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. దీనిని 425 బెడ్స్ వరకూ విస్తరించే అవకాశం ఉంటుంది. దేశంలోని కీలక ప్రాంతాల్లో అదనంగా 2,300 బెడ్స్‌ను యాడ్ చేయడం తమ ప్రణాళికని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు.

**క్యూ2 లాభంలో 14 శాతం వృద్ధి**

సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ నికరలాభం 14.2 శాతం వృద్ధిచెంది రూ. 233 కోట్లకు చేరింది. సంస్థ ఆదాయం సైతం 14 శాతం పెరిగి రూ. 4,847 కోట్లకు చేరింది. ఈబిటా రూ.565 కోట్ల నుంచి రూ. 627 కోట్లకు చేరింది.

## గ్యారెంటీ పాలసీ మార్చాల్సిందే

- **కొన్నప్పట్నుంచి కాదు.. ఇన్‌స్టాల్ చేసిన దగ్గర్నుంచే అమలు చేయాలి**
- **ఉత్పత్తిదార్లకు ప్రభుత్వం ఆదేశం**




న్యూఢిల్లీ, నవంబర్ 7: పండుగ సీజన్ సందర్భంగా పలు వినిమయ వస్తువులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఉత్పత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. వినియోగదారు కొనుగోలు చేసిన ఉత్పత్తిని కంపెనీ ఇన్‌స్టాల్ చేసిన తేదీ నుంచే వారెంటీ గడువు షెడ్యూల్‌ను ప్రారంభించాలని, కొన్న తేదీ నుంచి గ్యారెంటీని లెక్కించరాదని కేంద్ర వినియోగ వ్యవహారాల కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్...సీఐఐ, ఫిక్కీ, అసోచామ్‌లతో సహా ఆరు వాణిజ్య చాంబర్లకు, పలు కన్జ్యూమర్ గూడ్స్ కంపెనీలకు లేఖ రాశారు. సామ్‌సంగ్, ఎల్‌జీ, పానాసోనిక్, బ్లూస్టార్, కెంట్, వర్ల్‌పూల్, వోల్టాస్, బాష్, హావెల్స్, ఫిలిప్స్, తోషిబా, సోనీ, హిటాచీ, ఐఎఫ్‌బీ, గోద్రేజ్, హెయర్, యూరేకా ఫోర్బ్స్, లాయిడ్ తదితర ఉత్పత్తిదార్లకు కేంద్ర కార్యదర్శి లేఖ రాస్తూ వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం వినియోగదారు ఉత్పత్తిని ఉపయోగించని సమయాన్ని వారెంటీ/గ్యారెంటీ పీరియడ్‌గా పరిగణించడం అనైతిక వ్యాపారమని తెలిపారు. ఈ మేరకు రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, వాషింగ్ మెషిన్లు తదితర వైట్ గూడ్స్ తయారీ కంపెనీలు వాటి వారెంటీ/గ్యారెంటీ పాలసీని మార్చాలని ఆదేశించారు.

## అరబిందో లాభం 757 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 9: అరబిందో ఫార్మా అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను కంపెనీ రూ.757 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.409.4 కోట్ల లాభంతో పోలిస్తే 85 శాతం వృద్ధిని కనబరిచింది. కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికి 25.7 శాతం అధికమై రూ. 7,219.4 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.3 లేదా 300 శాతం తొలి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది సంస్థ.

## ఫోన్లలో డైరెక్ట్ టీవీ వద్దు: ఐసీఈఏ

న్యూఢిల్లీ, నవంబర్ 9: స్మార్ట్‌ఫోన్లలో నేరుగా టెలివిజన్ ప్రసారాలు వద్దని, దీనివల్ల మొబైల్ తయారీ రంగం తీవ్రంగా ప్రభావితం అవుతుందని మొబైల్ ఫోన్ ఇండస్ట్రీ సంఘం ఐసీఈఏ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన టెలీకమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ సెంటర్ (టీఈసీ) ఈ అంశంపై కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఐసీఈఏ నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మొబైల్ ఫోన్లలో ఏటీఎస్‌సీ 3.0 టెక్నాలజీని ఏర్పాటు చేయాలని టీఈసీ అంటున్నది. సెల్యులార్ నెట్‌వర్క్‌తో పనిలేకుండా టీవీ ప్రసారాలకు వీలుకానున్నది అంటున్నారు. అయితే ఇందుకు ఇప్పుడున్న తమ తయారీ వ్యవస్థలో భారీగా మార్పులు చేయాల్సి ఉంటుందని, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని ఐసీఈఏ చెప్తున్నది. ఫోన్ ధరలు కూడా పెరుగుతాయని, ఫలితంగా అమ్మకాలు ప్రభావితం కావచ్చని అంటున్నది.





Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) - 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR: Samrat Honda; Srikanth Honda; KARIMNAGAR INTERCITY BRANCH, VAVILALA RAMREDDY NAGAR: Samrat Honda; JAGATIAL: Vennela Honda; KORUTLA: Vennela Honda 1; SIRCILLA: Srikanth Honda; VEMULAWADA: Srikanth Honda; METPALLY: Saanvi Honda; JAMMIKUNTA: Srikanth Honda; HUSANABAD: Samrat Honda; HUZURABAD: Samrat Honda; RAMAGUNDAM: Sai Ram Krishna Honda; PEDDAPALLY: Sairam Krishna Honda; SULTANABAD: Aradhana Honda; DHARMARAM: Sairam Honda; MANCHERIAL: Jagadamba Honda; BELLAMPALLY: Thirumala Honda; ASIFABAD: Jagadamba Honda; KAGAZNAGAR: Jagadamba Honda; ADILABAD: Sree Mahalakshmi Honda; NIRMAL: Sree Mahalakshmi Honda; KHANAPUR: Sri Ganesh Honda; BHAINSA: Patel Honda.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com